ప్రజాశక్తి
ఆదివారం 18 డిసెంబర్ 2022 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

మాచర్లలో బోసిపోయిన రహదారి

- 'మాచర్ల మంటల'పై టిడిపి, వైసిపి పరస్పర ఆరోపణలు
- ఇరు పక్షాలపై కేసులు నమోదు చేసిన పోలీసులు
- టిడిపి 'చలో మాచర్ల'కు పోలీసు బ్రేకులు
- బీసీలతో వైసిపి ఆందోళన

మీరంటే...మీరే!

మాచర్లకు వెళ్లకుండా టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులును వినుకొండలో పోలీసులు అడ్డుకునే సందర్భంలో పోలీసులు, టిడిపి కార్యకర్తలకు తోపులాట

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి, పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా మాచర్లలో శుక్రవారం రాత్రి జరిగిన ఘర్షణలకు మీరంటే మీరే కారణమంటూ టిడిపి, వైసిపి పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. వైసిపి దాడులకు వ్యతిరేకంగా టిడిపి తలపెట్టిన 'చలో మాచర్ల'ను పోలీసులు భగ్నం చేశారు. టిడిపియే మాచర్లలో ఘర్షణలకు పాల్పడిందని, బీసీలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడిందని వైసిపి, బిసి సంఘాల ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు. గుంటూరు, పిడుగురాళ్లలో వడ్డెర సంఘాల నాయకులు నిరసన ర్యాలీలు చేపట్టారు. టిడిపి వారే శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్నారని మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులను హత్య చేయడానికి టిడిపి కుట్ర చేసిందని మంత్రి అంబటి రాంబాబు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. మాచర్లలో టిడిపి ఇన్‌ఛార్జి బ్రహ్మారెడ్డిపై మూకుమ్మడిగా దాడి చేయడమే లక్ష్యంగా వైసిపి నాయకులు దాడులు, విధ్వంసానికి పాల్పడ్డారని టిడిపి నాయకులు ఆరోపించారు. మొత్తంగా తమపార్టీ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి ప్రజల్లో తిరగకుండా కట్టడి చేయడానికే వైసిపి ప్రయత్నిస్తోందని టిడిపి నాయకులు

దాడికి గురైన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఆరోపిస్తున్నారు. బ్రహ్మారెడ్డి హత్యకు వైసిపి ప్రయత్నిస్తోందని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు ఆరోపించారు.

మరోవైపు ఇరు పార్టీలకు చెందినవారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అయితే టిడిపి నాయకుడు జూలకంటి బ్రహ్మారెడ్డి సహా 9 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. రేషన్ డీలరు చల్లా మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిడిపి నేతలపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. బ్రహ్మారెడ్డి, బాబూఖాన్ ఇద్దరు కలసి తనపై రాళ్లతో దాడి చేశారని మోహన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసులో బ్రహ్మారెడ్డిని ఎ-1గా నమోదు చేశారు. గుర్తు తెలియని దుండగులు టిడిపి కార్యకర్తలపై రాళ్లు రువ్వడంతో తామే రాళ్లు వేశామనే ఉద్దేశ్యంతో బ్రహ్మారెడ్డి తమపై దాడి చేశారని మోహన్ ఫిర్యాదులో తెలిపారు. అయితే టిడిపి నాయకుడు యర్రం పోలిరెడ్డి భార్య అన్నపూర్ణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ మాజీ చైర్మన్

▶ 2లో

డిఇఒ కార్యాలయంలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో అర్జీలు అందచేస్తున్న ఉపాధ్యాయులు

బదిలీలపై అర్జీల వెల్లువ!

- డిఇఒ కార్యాలయానికి తరలి వస్తున్న ఉపాధ్యాయులు
- బదిలీ మార్గదర్శకాల్లో లోపించిన స్పష్టత

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి కొన్ని మార్గదర్శకాల్లో స్పష్టత లేకపోవటంతో బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారింది. ఉపాధ్యాయులు వివిధ రకాల సమస్యలపై డిఇఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్‌కు వచ్చి పెద్ద ఎత్తున అర్జీలు అందచేస్తున్నారు. రెండ్రోజుల వ్యవధిలోనే సుమారు 800 వరకూ అర్జీలు అందినట్లు తెలిసింది. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో స్పౌజ్ పాయింట్లు, రేషనలైజేషన్ పాయింట్లు కలవట్లేదని, డేట్ ఆఫ్ జాయినింగ్ తప్పుగా నమోదయ్యాయని రకరకాల సమస్యలపై అర్జీలు అందచేస్తున్నారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో డిఇఒ కార్యాలయానికి చేరుకోవటంతో కోలాహలంగా మారింది. కొందరు ఎంఇఒలకు అవగాహన లేకపోటంతో ఉపాధ్యాయులను డిఇఒ కార్యాలయానికి పంపిస్తున్నారు. దీంతో డిఇఒ ఆఫీసులో రద్దీ పెరిగింది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు చేపడుతున్నందున దూర ప్రాంతాల నుండి ఉపాధ్యాయులు ఇక్కడికి వస్తున్నారు.

తొలుత ఇచ్చిన ఉత్తర్వుల్లో రేషనలైజేషన్ వల్ల రద్దువుతున్న చోట, బదిలీపై వెళ్లే జూనియర్లకు 5 పాయింట్లు ఇచ్చారు. సీనియర్లకు ఇవ్వలేదు. దీంతో సీనియర్లు ఎక్కువ మంది అదే పాఠశాలలో కొనసాగటానికి ఇష్టపడ్డారు. కానీ తాజాగా సీనియర్లకు కూడా ఐదు పాయింట్లు ఇవ్వటంతో సీనియర్లు మళ్లీ దరఖాస్తు చేస్తున్నారు. అప్పటికే ఆ పాఠశాల నుండి జూనియర్లు బదిలీపై వెళ్లటానికి దరఖాస్తు చేసుకోగా తాజాగా ప్రభుత్వం చేసిన మార్పు వల్ల సీనియర్లు కూడా పోటీ పడుతున్నారు. దీంతో గందరగోళం నెలకొన్నది.

80శాతంపైగా పిహెచ్‌సి ఉన్న ఉపాధ్యాయులకు నిబంధనల ప్రకారం బదిలీల నుండి

▶ 2లో

చట్టాలెక్కడా అమలు కాలేదు..

- పోరాడితే దళిత రైతులదే విజయం
- ఉద్యమానికి సంపూర్ణ మద్దతుగా నిలుస్తాం
- యడవల్లి రైతులకు మద్దతుగా ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం
- 21న సాగుపై పట్టణం, గ్రామాల్లో కొనసాగిన ప్రచారం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

యడవల్లి దళిత రైతుల భూ పోరాటం న్యాయమైందని, వారి భూములను ప్రభుత్వం తీసుకున్న ప్రక్రియలో చట్టాలెక్కడా సరిగా అమలు కాలేదని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. న్యాయం కోసం వారు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని ప్రకటించారు. పోరాడితే భుములెక్కడికీ పోవని అన్నారు. స్థానిక పండరిపురంలోని ఏలూరు సిద్ధయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు అధ్యక్షత

▶ 2లో

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న యడవల్లికి చెందిన మహిళా రైతు

ఎమ్‌డియు ఆపరేటర్ ఆత్మహత్యాయత్నం

తన చావుకు ఇద్దరి వేధింపులు కారణమని సెల్ఫీవీడియో - తెనాలి జిజిహెచ్‌లో చికిత్స

ప్రజాశక్తి-తెనాలి

ఆత్మహత్యాయత్నం చేసిన జాన్‌పాల్

తనను ఇద్దరు మానిసికంగా వేధించారని, తన చావుకు వారే కారణమని సెల్ఫీ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తి అనంతరం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అపస్మారక స్థితికి వెళ్లిన అతన్ని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. మండలంలోని కొలకలూరులో శనివారం చోటుచేసుకున్న ఘటనపై బాధితుని వీడియో, పోలీసుల వివరాల ప్రకారం..

గ్రామానికి చెందిన కె.జాన్‌పాల్ మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎమ్‌డియూ-రేషన్ వాహనం)

▶ 2లో

8 లో

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మంత్రి ఆర్‌కె రోజా

ఫస్ట్ బిహెచ్‌హెచ్.. రన్నరప్‌గా హిందూ కాలేజీ

విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు మృతి

న్యాయం చేయాలని మృతదేహంతో కుటుంబ సభ్యుల రాస్తారోకో

3 లో

విద్యార్థినులకు హిమోగ్లోబిన్ టెస్టులు

ప్రజాశక్తి-అమరావతి

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం సుమారు 800 మంది విద్యార్థినులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హిమోగ్లోబిన్ టెస్టులు నిర్వహించారు. అవసరం ఉన్న విద్యార్థినులకు ఐరన్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. అమరావతి ఎంపిపి, అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చైర్మన్ మేకల హనుమంతరావు యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. హనుమంతరావు మాట్లాడుతూ హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి అదనపు ఆహార పదార్థాలు అందించాలని వైస్ ప్రిన్సిపల్ ఇందిరా ప్రియదర్శినికి సూచించారు. ఈ పథకాన్ని విద్యార్థులు సద్వి నియోగం చేసుకోవాలని, ఆరోగ్యవంతులుగా తయారై, ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నా మన్నారు.

విద్యార్థినుల వసతి గృహం మరమ్మతులకు విరాళం

ప్రజాశక్తి-నూజెండ్ల



మండలంలోని ఎపి మోడల్ స్కూల్ విద్యార్థినుల వసతి గృహం మరమ్మతుల కోసం నూజెండ్ల గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వంగూరి ప్రసాద్ రూ.50 వేల నగదును హాస్టల్ వార్డెన్ లుర్దూ మేరీకి శనివారం అందజేశారు. మోడల్ స్కూల్ బాలికల వసతి గృహం సెప్టిక్ ట్యాంక్ నిండిపోయింది. దీంతో వాష్‌రూమ్ కి వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవటంతో స్కూళు ఓపెన్ చేసి నాలుగు నెలలు గడుస్తున్నా వసతి గృహాన్ని ప్రారంభించకపోవడంతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విష యాన్ని ఎమ్మెల్యే బొల్లా దృష్టికి తీసుకుపోగా ఆయన సూచ నల మేరకు ఈవిరాళం అందజేస్తున్నట్లు ప్రసాద్ తెలిపారు. అనంతరం వార్డెన్ మాట్లాడుతూ మరమ్మతుల అనంతరం వసతి గృహాన్ని తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రసాదుకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనూష

గ్రామీణ ప్రాంతంలో లక్షలాది రూపాయలు ఖర్చుతో పేదలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వ హించటం, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయడం ఈ ప్రాంత పేదలు చేసుకున్న మహాభాగ్యమని పారిశ్రామికవేత్త , విద్యాదాత దాసరి శేషగిరిరావు అన్నారు. శనివారం పెద నందిపాడు పిఎఎస్ కళాశాలలో దాతలు రావి శివ రామకృష్ణయ్య. శ్రీరాములు నేతృత్వంలో హైదరాబాద్ గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో ఈ ప్రాంతంలో తొలిసారిగా పేదల కోసం ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం లో పలువురు ప్రముఖులు పాల్గొని దాతల సేవలను కొనియాడారు. అనేక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన బస్సులో డాక్టర్లు శ్రీనాథ్,అనూష, చందన, కల్యాణిలు 122 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మెమోగ్రఫీ.పాప స్మియర్, ఎక్స్‌రే లాంటి ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. చికిత్స అవసరమైన రోగులను గుర్తించి నాలుగు రోజుల్లో నిర్వాహకులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య, ఎన్.సి.సి అధికారి పాతూరి శ్రీని వాస్‌లు ఎన్.సి.సి విద్యార్థులతో రోగులకు సేవలు అందిం చారు. రోటరీ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు విక్టర్ జాన్ పాల్ కోదండరామయ్య, పోపూరి లక్ష్మీనారాయణ, ఎలిసెట్టి రమణ, రాజేంద్రప్రసాద్, పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

మీరంటే...మీరే!

(మొదటి పేజీ తరువాయి)

తురకా కిషోర్‌తో పాటు 10 మందిపై వాహనాల ధ్వంసం, దగ్ధం, దాడులకు సంబంధించిన కేసులు నమోదు చేశారు. సెక్షన్ 323, 448, 143, 147 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కేసులో ఎ-1గా తురకా కిషోర్, ఎ-2గా చల్లా మోహన్‌ను చేర్చారు.

వినుకొండలో టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షుని అరెస్టు

మాచర్లకు వెళ్లేందుకు వినుకొండలో బయలుదేరిన టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి.ఆంజనేయులను సిఐ అశోక్ బాబు, ఎస్ఐ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కార్యకర్తలు, పోలీసులకు మధ్య కొద్దిసేపు తోపులాట నెలకొంది. జివి ఆంజనేయులు మీడియాతో మాట్లాడుతూ మాచర్లలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సిఐతో సెలవు పెట్టించి మరి వైసిపి గుండాలతో దాడులు చేయించారని ఆరోపించారు.

పోలీసులను తప్పించుకుని గుంటూరులో ధర్నా

మాచర్లలో టిడిపి కార్యకర్తలపై దాడిని నిరసిస్తూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర (నాని) మాచర్లకు బయలుదేరగా పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పోలీసులను తప్పించుకొని గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్న రవీంద్ర అనంతరం అరండల్‌పేట మెయిన్ రోడ్డుపై ధర్నా చేపట్టారు. తూర్పు ఇంచార్జి నజీర్, కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరావు, ఈరంటి వరప్రసాద్, పాకలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో అడ్డగింత

మాచర్ల వెళ్లేందుకు బయలుదేరిన సత్తెనపల్లి టిడిపి నాయకులను స్థానిక పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నాయకులకు, పోలీసులకు వాగ్వావాదం, తోపులాట తలెత్తాయి. టిడిపి నాయకులు మన్నెం శివనామల్లేశ్వరరావును పోలీసులు లాక్కెళ్లి జీపులోకి ఎక్కించారు.

పిడుగురాళ్లలో టిడిపి, వైసిపి ర్యాలీలు

పట్టణంలో వైసిపి, టిడిపి వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించాయి. టిడిపి కార్యాలయం నుంచి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వరకు ఆ పార్టీ శ్రేనణులు ప్రదర్శన చేయగా వైసిపి కార్యాలయం నుంచి ఆ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు.

నర్సరావుపేటలో అరవిందబాబు నిరసన

మాచర్లలో వైసిపి నేతలు ముందస్తు పథకం ప్రకారమే టిడిపి కార్యకర్తలపై దాడికి దిగారని, వైసిపి ఓటమి భయంతో అలజడులు సృష్టిస్తోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. చలో మాచర్ల పిలుపులో భాగంగా మాచర్లకు బయల్దేరిన ఆయన్ను పోలీసులు అడ్డుకోవడంతో టిడిపి శ్రేణులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు.

చిలకలూరిపేటలో పుల్లారావు గృహ నిర్బంధం

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి డైరెక్షన్‌లోనే మాచర్ల ఘటన జరిగిందని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. పండరీపురంలోని ఆయన నివాసంలో పోలీసులు గృహ నిర్బంధం చేయగా పుల్లారావు మీడియాతో మాట్లాడారు. రాడ్లు, కర్రలు, బండరాళ్లతో టిడిపి నాయకులపై కిరాతకంగా దాడి చేశారని, బ్రహ్మారెడ్డిని చంపేందుకే ఈ దాడని అన్నారు.

తెనాలిలో టిడిపి ప్రదర్శన, రాస్తారోకో

పట్టణంలో టిడిపి శ్రేణులు బైక్ ర్యాలీ

చేసి మార్కెట్ కూడలిలో ధర్నా గంటపాటు రాస్తారోకో చేశాయి. పోలీసుల జోక్యంతో ఆందోళన విరమించారు. నిరసనలో నాయకులు ఎ.జయలక్ష్మి, డాక్టర్ వి.శేషగిరి రావు, ఇ.వెంకటపూర్ణచంద్, కె.కనకరాం బాబు, ఎ.పిన్నారావు, మహ్మద్ ఖుద్దూస్, జె.మహేష్, కె.ఏడుకొండలరు. కె.రమాదేవి, జె.రేణుక పాల్గొన్నారు.

తాడేపల్లి: వైసిపి దాడులు ఇలాగే కొనసాగితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని టిడిపి తాడేపల్లి పట్టణ కార్యదర్శి దారా దాసు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బి.రామకృష్ణారావుతో విలేకర్లతో మాట్లాడి మాచర్ల ఘటనలను ఖండించారు.

బదిలీలపై అర్జీల వెల్లువ!

(మొదటి పేజీ తరువాయి)

మినహాయింపు ఉంది. కానీ తాడికొండలో ఒక పిహెచ్ కోటా ఉపాధ్యాయురాలిని బదిలీ కావాల్సిందేనని అక్కడి ఎంఇఒ పట్టుబట్టినట్లు సమాచారం. దీంతో సదరు ఉపాధ్యాయిని డిఇఒ కార్యాలయానికి వచ్చి అర్జీ అందచేశారు.

ఇటీవల ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పిస్తూ వారి నుండి అంగీకార పత్రాలు తీసుకున్నారు. బదిలీలు ముగిశాక మిగిలిన ఖాళీలలో పదోన్నతులు పొందిన వారిని నియమిస్తామని అప్పట్లో విద్యాశాఖ అధికారులు తెలిపారు. అయితే ఇప్పుడు ఒక ఉపాధ్యాయుడు లాంగ్ స్టాండింగ్ అయ్యి ప్రమోషన్ కూడా పొంది ఉంటే అతను బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలా..? లేదా..? స్పష్టత లేదు. బదిలీ ఉత్తర్వులో పదోన్నతికి అంగీకారం తెలిపిన వారి ప్రస్తావనే లేదు. దీంతో జిల్లాలో పదోన్నతి పొందిన సుమారు 250 మంది ఆందోళన చెందుతున్నారు.

మినిమం టైమ్ స్కేల్ విధానంలో కొందరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. రేషనలైజేషన్‌లో పోస్టు పోతే వారి పరిస్థితి ఏంటనేది స్పష్టత లేదు. అనేక సాంకేతిక సమస్యలు కూడా ఎదురవుతున్నాయి. ముఖ్యంగా పిహెచ్‌సి, స్పౌస్, రేషనలైజేషన్ పాయింట్లు చూపించట్లేదు. దీంతో పెద్ద ఎత్తున అర్జీలు అందచేస్తున్నారు. మొదట ప్రకటించిన షెడ్యూలు ప్రకారం బదిలీల దరఖాస్తుకు నేటితో గడువు ముగిసింది. కానీ సంఘాల డిమాండ్‌తో నేటి వరకూ పొడిగించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మార్గదర్శకాల్లో అసంబద్ధాలను సరిచేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

చట్టాలెక్కడా అమలు కాలేదు..

(మొదటి పేజీ తరువాయి)

వహించగా ప్రజా సంఘాలు, దళిత సంఘాలు, వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ యడవల్లి దళిత సొసైటీ ఉందో లేదోనని విషయం తెలుసుకోవడం ముఖ్యమని, దీనిపై గతంలో ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్‌నూ కలిశామని గుర్తు చేశారు. దీనిపై 2014లో ఆర్‌డిఒ, తహశీల్దార్‌కు సమాచారం హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినా సమాధానం దాట వేస్తున్నారని తెలిపారు. 2013 చట్టం అమలు చేయకుండా జీవో 270 ద్వారా ఏ పద్ధతిలో భూములను తీసుకున్నారో ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ భూముల్లో గ్రానైట్ ఉందంటున్నారని, దానితో దళితులు వ్యాపారం చేసుకోకూడదా? అని ప్రశ్నించారు.

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రోశయ్య, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.రాధాకృష్ణ, పట్టణ అధ్యక్షులు న్యాయవాది ప్రసన్నకుమార్, నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆర్.సుబ్రహ్మణ్యం, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.శ్రీనునాయక్, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి టి.కోటేశ్వరరావు, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.మోహన్‌రావు, నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు, దళిత సంఘం నాయకులు రాజు, కె.రోశయ్య, ఎం.విల్సన్, బాధిత రైతులు పాల్గొన్నారు.

21న సాగుపై పట్టణం, గ్రామాల్లో ప్రచారం

తమ డిమాండ్లపై అధికారులు, ప్రభుత్వం 20 లోగా స్పందించి న్యాయం చేయాలని, లేకుంటే 21న తమ భూముల్లో సాగును ప్రారంభిస్తామని బాధిత రైతులు చేపట్టిన ప్రచారం శనివారం పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాయకులు, బాధిత రైతులు పట్టణంలోని రాగన్నపాలెం, తూర్పు మాలపల్లె, సంజీవనగర్, నెహ్రూ నగర్, మండలంలోని పసుమర్రు, మానుకొండవారిపాలెం, వేలూరు, దండమూడి, గొట్టిపాడు, మిట్టపాలెం తదితర ప్రాంతాల్లో ప్రచారం చేసి తమకు జరుగుతున్న అన్యాయంపై స్థానికులకు వివరించారు. తమ పోరాటంలో కలిసి రావాలని కోరారు. సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు పి.వెంకటేశ్వర్లు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి టి.పెద్దిరాజు, భవన నిర్మాణ సంఘం పట్టణ కార్యదర్శి కె.రోశయ్య, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.విల్సన్ బాధిత రైతులు వి.శాంసన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్‌డియు ఆపరేటర్ ఆత్మహత్యాయత్నం

(మొదటి పేజీ తరువాయి)

ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 15న రేషన్ బియ్యం అక్రమంగా తరలుతున్నాయంటూ రూరల్ పోలీసులకు అందిన సమాచారంతో ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. హాఫ్‌పేట వద్ద వాహనాన్ని పరిశీలించగా అందులో 60 బస్తాల బ్యియం పట్టుబడ్డాయి. ఒక్కో బస్తా 50 కిలోలు ఉంది. వాహన చోదకుని నుంచి వివరాలు సేకరించగా ఎమ్‌డియూ ఆపరేటర్ జాన్‌పాల్ ఇంటి వద్ద నుంచి బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం ఇవ్వడంతో ఈ మేరకు మధ్యవర్తుల సమక్షంలో స్టేట్‌మెంట్ నమోదు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటనే జాన్‌పాల్ ఆత్మహత్యాయత్నానికి దారితీసినట్లు సమాచారం. గ్రామానికి చెందిన ఫణికుమార్, కార్తీక్ అనే ఇద్దరు తనను వేధిస్తున్నారని, ఉద్దేశపూర్వకంగా తనను కేసులో ఇరికించారని, తన చావుకు వారే కారణమని సెల్ఫీ వీడియోను జాన్‌పాల్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కొద్దిసేపటికి పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని కుటుంబ సభ్యులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం.

ఘనంగా పెన్షనర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి -అమరావతి

పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన అమరావతిలో శనివారం ఏపిఎస్‌జి పెన్షనర్ల సమావేశం జరిగింది. స్థానిక శోభ సుధాకరం ప్రాంగణం యోగాశ్రమంలో జరిగిన ఈ సమావేశంలో డెబ్బై ఐదేళ్లు నిండిన పెన్షనర్లను సన్మా నించారు. ఈ కార్యక్రమానికి గుంటుపల్లి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్లు ఎదు ర్కొంటున్న సమ స్యల గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమా నికి విచ్చేసిన వారికి రిటైర్డ్ లెక్చరర్ యడ్లవల్లి సుబ్బారావు విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. అమరావతి, పెదకూర పాడు మండలాలకు చెందిన పెన్షనర్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మంగళగిరి:** పెన్షనర్స్ డే ని పురస్కరించుకొని శనివారం మంగళగిరి ఏపీఎస్పీ పెన్షనర్స్ అసోసి యేషన్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఏపీఎస్పీ పెన్షనర్స్ అసో సియేషన్ ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఏపీఎస్పీ అడిషనల్ కమాండెంట్ సాయి ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 12 మంది పెన్షనర్స్ ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు తోట సాంబశివరావు, అసోసియేషన్ నాయకులు తాటి కృష్ణారావునాయుడు, అరవింద్, గుడిపాటి చిన్న తిరుపతినాయుడు

వ్యవసాయ బావిలో మొసలి

పట్టుకున్న అటవీశాఖ అధికారులు

ప్రజాశక్తి - మాచర్ల

నకరికల్లు మండలం, కుంకలగుంట గ్రామంలోని ఒక రైతు తన వ్యవసాయ బావిలో ఉన్న మొసలిని గుర్తించాడు. ఈ మేరకు మాచర్ల అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా అధికారులు బోను పెట్టి మొసలిని పట్టుకున్నారు. సదరు మొసలిని మాచర్లలోని జనరల్ ఫారెస్టు కార్యాలయానికి శనివారం తీసుకొచ్చారు. దానిని సాగర్‌లోని వైల్డ్ లైఫ్ ఫారెస్టు వారికి అప్పగించనున్నట్లు జనరల్ ఫారెస్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా బోల్లాపల్లి మండలానికి చెందిన డిఆర్ఓ ఎకసిర సూర్యనారాయణ మాట్లాడుతూ కుంకలగుంటకు చెందిన రైతు గోరంట్ల చౌడయ్య తన వ్యవసాయ భూములలోని బావిలో మొసలి ఉన్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న ఫారెస్టు అధికారులు ప్రత్యేక బోను తయారు చేసి మొసలికి కావలసిన ఆహారాన్ని ఆ బోనులో ఏర్పాటు చేసి పథకం ప్రకారం

మొసలిని బోనులోకి రప్పించారు. మొసలి ఆరోగ్యం బాగానే ఉందని తెలిపారు. వినుకొండ ఎఫ్ఆర్ఒ సయ్యద్ హుస్సైన్ సారథ్యంలో ఆపరేషన్ మొసలి కొనసాగింది.

నకార స్ఫూర్తితో పెన్షన్ హక్కు కోసం పోరాటం

ప్రజాశక్తి-గుంటూరు

మన హక్కులు మనమే కాపాడుకోవటానికి పెన్షనర్ల పోరాటయోధుడు డి.ఎస్.నకార స్ఫూర్తితో ఉద్యమించాలని పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఏపీ సర్కిల్ అసిస్టెంట్ సెక్రెటరీ సిహెచ్.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. పెన్షనర్స్‌డే సందర్భంగా శనివారం గుంటూరు పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట జరిగిన సమావేశానికి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వి.మోమనరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు నకార చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడుతూ, పెన్షన్ ఎవరి బిక్ష కాదని, రాజ్యాంగం కల్పించిన హక్కు అని వివరించారు. ప్రస్తుత ఉద్యోగులంతా ఓల్డ్ పెన్షన్ సాధన కోసం పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర కోశాధికారి సిహెచ్.హనుమంతరావు, కెవి.ప్రసాదరావు ప్రసంగించారు. ఈ

డిఎస్ నకార చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్ నాయకులు

సందర్భంగా ఎన్ఎఫ్‌పిఈ జాతీయ యకులు కెకెఎస్ కుట్టి మృతి పట్ల సమావేశం సంతాపం ప్రకటించింది.

వంట మాస్టర్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -మేడికొండూరు : కష్టం చేసిన పనికి, కూలి ఇవ్వలేదని వంట మాస్టర్ ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నిం చాడు. ఈ సంఘటన మండలం లోని పేరేచర్ల సత్తెనపల్లి రోడ్డు లోని లక్ష్మీనరసింహ కాలనీలో శనివారం జరిగింది. నెల్లూరు జిల్లాకు చెందిన ఎం. రాము వృత్తిరీత్యా వంట పని చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. అందులో భాగంగా గత కొద్ది నెలల క్రితం నెల్లూరు జిల్లా నుంచి పేరేచర్లకు వలస వచ్చాడు. పని చేయించు కున్న వారు కూలి ఇవ్వకపోవడంతో మన స్థాపానికి గురై కత్తి తోటి తన చేయి కోసు కున్నాడు. దీంతో చేతికున్న ప్రధానమైన నరము తెగి తీవ్ర రక్తస్రావమయ్యి పడిపోయాడు. స్థానికులు అతని 108 సహాయముతో క్షతగాత్రుని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు మృతి

న్యాయం చేయాలని మృతదేహంతో కుటుంబ సభ్యుల రాస్తారోకో

ప్రజాశక్తి - రొంపిచర్ల

విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్న గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. సేకరించి వివరాలు ప్రకారం రాజుపాలెం మండలం కొండమోడు గ్రామానికి చెందిన రామచంద్రప్ప సందీప్ బుచ్చిపాపన్న పాలెం గ్రామంలో రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా ఎం.పి.ఏస్.సి (మల్టీ పర్పస్ స్పేస్ సెంటర్) భవన నిర్మాణ పనులకు వచ్చారు. రాడ్ బెండింగ్ పనులకు వచ్చిన సందీప్ నిర్మాణానికి బెల్ట్ పోసేందుకు గోడపై ఇనుప చువ్వలు కడుతుండగా ప్రమాదవశాత్తు ఇనుప చువ్వలు విద్యుత్ తీగెలపై పడడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న గోదాము కాంట్రాక్టర్లు ఫోన్లు స్విచ్చాఫ్

మృతదేహంతో ఆందోళన చేస్తున్న కార్మికుని కుటుంబ సభ్యులు

చేసుకోగా సందీప్ కుటుంబ సభ్యులు మృత దేహంతో రొంపిచర్ల వద్ద అద్దంకి నార్కెట్ పల్లి రాష్ట్ర రహదారిపై బైఠాయించి న్యాయం చేయాలంటూ ధర్నాకు దిగారు. రూ 10 లక్షల నగదు, ఇళ్ళు, కొంత భూమి సంబంధిత కాంట్రాక్టర్ల నుండి ఇప్పించాలన్నారు. ఈ విషయమై మరింత సమాచారం కోసం పోలీసులను ఫోన్ లో సంప్రదించగా స్పందించలేదు.

నేడు ఎపిజిఇఎ జిల్లా కౌన్సిల్

ప్రజాశక్తి-గుంటూరు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశాలు ఆదివారం స్థానిక మెడికల్ కాలేజి ప్రాంగణంలోని జింకానా ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా, ప్రధాన కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న సభ్యులు హాజరవు తున్నట్లు తెలిపారు. సమావేశాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు హాజరవుతున్నారని తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పల్నాడు జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు 2022- 23 కు విద్యా సంవత్సరానికి గాను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేయుటకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని శ్రీశైలం ప్రాజెక్ట్ ఆఫీసర్ తెలిపినట్లు రెంట చింతల ప్రిన్సిపాల్ మోహన్ పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు 16వ తేదీ నుండి 24వ వరకు దరఖాస్తులతో పాటు రెజ్యూమ్, అర్హతకు సంబంధించి సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను రెంటచింతల పాఠ శాలలో అందజేయాలని అన్నారు.

మదర్సా భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఆడపిల్లలు ఉన్నత విద్యనభ్యసించిన నాడే సమాజ అభివృద్ధిలో వారు కీలకపాత్ర వహిస్తారని జ్ఞానేశ్వర ఫౌం డేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా అన్నారు. స్థానిక పురుషోత్తమ పట్నంలోని ఆడపిల్లల మదర్సా భవన నిర్మాణానికి రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జాన్ సైదా మాట్లాడుతూ చదువుల్లో రాణించే వారికి జ్ఞానేశ్వర ఫౌండేషన్ ప్రోత్సహించి సహాయ సహకారాలంది స్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జె. సుబ్బారావు, ముఫ్తి అనస్ ఖాన్,షేక్ బాబు,షేక్ కరిముల్లా, అల్లాభక్షు, రజాక్, బడేమియా, బేరింగ్ కలేషావలి, ఎం.శేషు రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23 నాటికి ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : ఎలక్షన్స్ కు సంబంధించి ఓటర్ జాబితాలో కొత్తగా నమోదు, గతంలో జారీ చేసిన వాటిలో మార్పులు చేర్పులు, తీసివేయాల్సిన క్లైములను ఈ నెల 23 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టర్ కార్యా లయంలో మండల రెవెన్యూ అధికారులు, రిటర్నింగ్ అధికారు లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలాలు వారీగా సమీక్ష నిర్వహించారు. ఫామ్- 6, 7 ,8 ల క్లైములను ఆదివారం కూడా విధులు నిర్వహించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఫొటో సిమిలర్ ఎంట్రీ లకు సంబంధించి జాగరూకత వహించాలని, అవసరమైన మార్పులు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ పున:ప్రారంభించాలి : సిఐటియు

ప్రజాశక్తి-గుంటూరు

ఒంగోలు రీజియన్ పరిధిలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.రమాసుష్మ, పి.దీప్తి మనోజ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి రాత పరీక్ష నిర్వహించిందని, పరీక్ష ఫలితాలు ప్రకటించే విషయంలో జరిగిన అవకతవకలపై అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ నిలుపుదల కోసం హైకోర్టులో కేసు వేశారన్నారు. హైకోర్టు విచారణ అనంతరం పోస్టుల భర్తీ ప్రక్రియకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ఇతర రీజియన్లలో సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ ప్రక్రియ పున:ప్రారంభించినా, ఒంగోలు రీజియన్‌లోని గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మాత్రం ఇంత వరకూ పున:ప్రారంభించలేదన్నారు. తక్షణమే భర్తీ ప్రక్రియ పున:ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న డిఇఒ శైలజ

ఎస్‌సిఈఆర్‌టి ఆధ్వర్యంలో

ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

ఎస్‌సిఈఆర్‌టి ఆధ్వర్యంలో ఈనెల 12న నుండి 21వ తేదీ వరకూ ఎంపిక చేసిన ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, సిఆర్‌పిలకు స్థానిక చలమయ్య జూనియర్ కాలేజిలో నిర్వహిస్తున్న శిక్షణను డిఇఒ పి.శైలజ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ఈ శిక్షణ ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలు పెంచుకోవటానికి అవసరమైన సాధనాలు, నూతన విధానాలు నేర్చుకోవటానికి దోహదపడుతుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం అనంతరం పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించి, బోధనా నైపుణ్యాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ అబ్దుల్ ఖుద్దూస్, ఎండి.ఖాసిం, మాస్టర్ ట్రైనర్లు ఎం.పద్మలత, శ్రీనివాసరావు, జి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గురజాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.A 103/17 in E.P 19/16 in O.S 206/10

బిట్వీన్:-

బిల్లా శ్యాం సైమన్ @ శ్యాం సైమన్ మోహనరావు ...పిటీషనరు/DHR

మరియు

శానము వెంకటేశ్వర్లు (Died) & another ...రెస్పాండెంట్లు/JDR

అడ్రసు:అంగజాల అనురాధ, W/o. శ్రీనివాసరావు, సా॥ మల్కాపురం, H/o.పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట మండలం, కృష్ణాజిల్లా.

పై నెంబరు అమలును JDR పై దాఖలు చేయగా సదరు అమలులో JDR చనిపోయివున్నాడు. సదరు అమలులో LR పిటీషన్ దాఖలు చేయగా సదరు 2 వ రెస్పాండెంటునకు కోర్టు వారు నోటీసు ఆర్డరు వేసినారు. సదరు రెస్పాండెంటునకు నోటీసు నిమిత్తము ది.23-12-2022 వ తేదినకు వాయిదా వేసినారు. సదరు వాయిదా రోజు ఉదయం 10-30గం॥లకు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసియున్నది. లేనిచో పరోక్షమందు తీర్మానించబడును.

ఇట్లు
ఆచంట శ్రీనివాసరావు,
పిటీషనరు తరపు న్యాయవాది,
గురజాల, సెట్.నెం9849031191.

పబ్లిక్ నోటీసు

IN THE COURT OF THE PRL.SENIOR CIVIL JUDGE, NARASARAOPET.
S.O.P.4/2022

Between:
Vattem Srilakshmi and 3 others ...Petitioners

VS

The Post Master, Head Post Office, Narasaraopet and another ...Respondents

పై నెంబరు గల పిటీషన్‌లో పిటీషనర్లు, రెస్పాండెంట్స్ వద్ద ఉన్న అమౌంటు గురించి వారసత్వ సర్టిఫికెట్ ఇప్పించవలసినదిగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, నరసరావుపేట నందు యస్.ఓ.పి. దాఖలు చేసియున్నారు. సదరు విషయము గురించి పిటీషనర్లకు వారసత్వ సర్టిఫికెట్ జారీ చేయుటకు ఎవరికైనా, ఏమైనా అభ్యంతరములు ఉన్నచో ది.30-12-2022వ తేదీన ఉ॥10-30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనిచో శ్రీ కోర్టువారు ఎవరికి ఎటువంటి ఆక్షేపణలు లేవని తీర్మానించగలరు.

(కోర్టు వారి అనుమతితో)

వాయిదా:30-12-2022

ఇట్లు
M.HARISH KUMAR,B.A.,L.L.B,
Advocate,
D/44, NSP Colony,
NARASARAOPET,
Mob:9000727483.

Notice

IN THE COURT OF THE HON'BLE XII ADDL. DIST.JUDGE -CUM- FAMILY COURT::GUNTUR
F.C.O.P (G.W.O.P)No: 706/ 2022

Between:
Devarapalli Anitha, W/o.David, Employee, Guntur Municipal Corporation, R/o.Door No:17-6-9/3, 3rd lane Ananda Pet, Guntur, Guntur Dist. ...Petitioner

And

Nill ...Respondents

పై నెంబరు O.P లోని పిటీషనరు మైనరు పిల్లలు అయిన దేవరపల్లి మేరీ శాంతి మరియు దేవరపల్లి మేరీ కృపావరం ల యొక్క ప్రాపర్టీకి మరియు ఫ్యామిలీ పెన్షన్ వగైరాల కోరకు పిటీషనరును గార్డియన్ గా నియమించమని పిటీషన్ దాఖలు చేయగా సదరు పిటీషన్ లో ఎవరికైన ఏవిధమైన అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకోనవలసినదిగా శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తము ది:ద05-01-2023 కి వాయిదా వేసినారు.కావున సదరు పిటీషన్ పై అభ్యంతరముల ఉన్న వారు ది:05-01-2023 న ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోనవలసినదిగా తెలియజేయటమైనది.లేని యెడల శ్రీకోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:05-01-2023

B.KOTESWARA RAO,
పిటీషనరు తరపు అడ్వకేట్,
గుంటూరు, సెల్: 99896 23969

దావా సమన్లు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు : పర్చూరు

OS NO. 187/2021

Between:
పాలేరు మోహనబాబు ...వాది

V/s

మారెళ్ళ సూరిబాబు ....ప్రతివాది

To
మారెళ్ళ సూరిబాబు
S/o సుబ్రమణ్యం, Age 30years, R/o Door No 4-45, kanteru, Tatikonda Mandal. Guntur District

పై నెంబరు దావాని వాది అయిన పాలేరు మోహన బాబు. ప్రతివాది అయిన నీ నుండి రావలసిన Promisuarynote బాకీ ని రాబట్టుకొను నిమిత్తం పై నెంబరు దావాని పై కోర్టులో దాఖలు చేసి యున్నారు. ఇందు నిమిత్తం నీకు ఏమైనా అభ్యంతరములు ఉన్నయెడల ది. 21-12-2022 ఉదయం 10.30 నిమిషాలకు నీవు స్వయంగా కానీ, వకీలు ద్వారా కానీ పై కోరువారి యెదుట హాజరయి మనవి చేసుకొనవలెను. లేనిచో నీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియ చేయడమైనది.

ఇట్లు
బండారుపల్లి హేమంతకుమార్
బీ.కాం. బి.యల్
అడ్వకేట్ & నోటరీ (కేంద్ర ప్రభుత్వం),చర్చ్ కాంపౌండ్, పేరాల, చీరాల -523157.

పంట నష్టపరిహారం కోసం రేపు ధర్నాలు

ప్రజాశక్తి - నరసరావుపేట

తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులందర్నీ ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయాలు, సచివాలయాల వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే ధర్నాల్లో రైతులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వర్షాల వల్ల చేతికొచ్చేదశలో ఉన్న పంట దెబ్బతిందని, రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికే పెట్టుబడి ఖర్చులు పెరిగి అప్పులతో రైతులు వ్యసాయం చేస్తున్నారని, వారిని తుపాను మరింత నష్టాల్లోకి నెట్టిందని చెప్పారు. ప్రభుత్వం సత్వరమే పంట నష్టం అంచనాలు వేసి పరిహారం ఇవ్వడం ద్వారా బాధజత రైతులకు భరోసాగా నిలవాలని కోరారు.

వాలీబాల్ విజేత కందుకూరు

ప్రజాశక్తి - నరసరావుపేట

ఆటలతో ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం కలుగుతుందని కృష్ణవేణి డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు అన్నారు. కాలేజీలో నిర్వహిస్తున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాల పురుషుల వాలీబాల్ పోటీలు శనివారం ముగిశాయి. కందుకూరు టి.ఆర్.ఆర్ కళాశాల జట్టు విజేతగా నిలవగా రెండో స్థానంలో సింగరాయకొండ పి.ఎన్.సి.ఎ కళాశాల జట్టు, మూడో స్థానంలో తెనాలి ఎఎస్ఎన్ కాలేజీ, నాలుగో స్థానంలో బాపట్ల బిఇసి కాలేజీ జట్టు నిలిచాయి. విజేతలకు కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, కె.వీరరాఘవులు, ఎంఆర్కె సతీష్‌బాబు, పీడీ ఆదిబాబు, మహమ్మద్, షకీలా,వర్సిటీ జట్టు ఎంపిక సభ్యులు రిఫరీలు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకు ప్రదర్శనలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని ఆర్‌విఎస్‌సివిఎస్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన మండలస్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనను కేరళలోని అలెప్పి జిల్లా కలెక్టర్ మైలవరపు కృష్ణతేజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి ప్రదర్శనలు దోహదం చేస్తాయని చెప్పారు. పలు నమూనాలను పరిశీలించి వాటి గురించి విద్యార్థులతో మాట్లాడారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటప్పయ్య మాట్లాడుతూ మండలంలోని 13 ప్రభుత్వ పాఠశాలల నుండి విద్యార్థులు ప్రదర్శనలు తెచ్చారని, వీటిలో 39 భౌతికశాస్త్ర నమూనాలు, 8 గణిత నమూనాలు, 25 జీవశాస్త్ర నమూనాలు ఉన్నాయని వివరించారు. ప్రదర్శనకు వచ్చిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఎంఇఒ కె.లక్ష్మి, కరస్పాండెంట్ ఎం.శివానంద కుమార్, జాయింట్ సెక్రెటరీ బి.రామకోటేశ్వరరావు, హెచ్ఎం యు.వెంకటేశ్వరరావు బి.వెంకటేశ్వరుర్ల, జివి.రమణరావు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఎన్జీవోల కృషి అభినందనీయం

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- క్విజ్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

సాయం అందిస్తున్న మంత్రి తదితరులు

విద్యా విధానాల్లో ప్రభుత్వం సమూల మార్పులు తెస్తున్న తరుణంలో విద్యాభివృద్ధికి ఎన్జీవోల కృషి అభినందనీయమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. రామానుజ జాతీయ గణిత ఉత్సవాలను సందర్భంగా 'చదివిద్దాం' ట్రస్టు, నాటా సంస్థలం సంయుక్తాధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 9, 10 తరగతుల విద్యార్థులకు గణిత క్విజ్ పోటీలను పల్నాడు జిల్లా కేంద్రం నరసరావు పేటలోని భువనచంద్ర టౌన్‌హాల్ శనివారం నిర్వహించారు. బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథులుగా మంత్రి అంబటి రాంబాబు, జిల్లా కలెక్టర్ ఎల్.శివ శంకర్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలు విద్యార్థులు, యువతలో స్ఫూర్తి నింపుతాయని చెప్పారు. పల్నాడులో విద్యాభివృద్ధికి నాటా సంస్థ సహకారం తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నాటా, చదివిద్దాం ట్రస్టులు పదేళ్లుగా విద్యా, వైద్య రంగాల్లో చేస్తున్న కృషి ఎంతో ఉపయుక్తంగా ఉందని అన్నారు. అనంతరం క్విజ్‌లో విజేతలకు బహుమతులు ప్రదానంతోపాటు ప్రతిభావంతులైన విద్యార్థులు, వైద్య అవసరాల్లో ఉన్న వారికి ఆర్థిక ప్రోత్సాహం, సాయం అందించారు. కార్యక్రమంలో నాటా ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ ఆళ్ల రామిరెడ్డి, సెక్రటరీ జి.నారాయణరెడ్డి, డైరెక్టర్లు కె.రాధా కృష్ణారెడ్డి, ఎస్.సత్యనారాయణరెడ్డి, రీజినల్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ మోరా, ఇండియా కో- ఆర్డినేటర్ పార్థసారథి, న్యాయవాది ప్రతాప్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ ఎం.ఉమాదేవి, నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పి.ఈశ్వరరెడ్డి, క్వాలిటెస్ట్ వైస్ ప్రెసిడెంట్ దేవనాగ్ పడవల, కె.జోగిరెడ్డి, మధుకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహేంద్ర తేజ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి : మండల కేంద్రమైన అమరావతిలోని గుంటూరు రోడ్డులో చెరుకూరి ప్రతాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహేంద్ర తేజ ఫిల్లింగ్ స్టేషన్‌ను సిబిఎస్ ఐఎఎస్ అకాడమీ ఛైర్‌పర్సన్ మల్లవరపు బాలలత శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌సిపిఎల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ దీపక్, కంపెనీ ఉద్యోగులు ప్రవీణ్ కుమార్, అక్షయ్ సోహన్, ఆకాష్ త్రిపాఠి, బిజెపి నాయకులు వై.రామారావు, టిడిపి నాయకులు కె.వసంతరావు, సిహెచ్.శౌరి, పి.వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు డి.నాగేంద్ర, టి.నాగేంద్రరరావు పాల్గొన్నారు.

డిఆర్ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మరింత సంక్షోభంలోకి చేనేత రంగం

- భారాలు మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన, వినతి

ప్రజాశక్తి - నరసరావుపేట

చేనేత రంగం ఇప్పటికే సంక్షోభంలో ఉండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుల భారం మోపి మరింత సంక్షోభంలోకి నెడుతున్నారని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. చేనేతపై పన్నుల భారం తగ్గించి ఆ రంగాన్ని కాపాడాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి డిఆర్ఒ వినాయకంకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత చేనేత ప్రధాన వృత్తిగా ప్రసిద్ధి చెందిందని, పాలకుల కార్పొరేట్ అనుకూల విధానాలతోపాటు జీఎస్టీ విధింపు చేనేతను దెబ్బతీసిందని విమర్శించారు. కార్మికులు ఆకలి చావులకు, ఆత్మహత్యలకు బలవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. చేనేతకు అవసరమైన పట్టు ధరలు 2022లో 100 శాతం పెంచారని, కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించి పవర్ లూమ్ యజమానులకు మోడీ ప్రభుత్వం రాయితీలు ఇస్తోందని మండిపడ్డారు. 2022 బడ్జెట్లో చేనేతకు రూ.500 కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించి చేనేతకు ద్రోహం చేసిందని అన్నారు. చేనేత రంగ అభివృద్ధికి కట్టుబడి ఉంటా నని ఎన్నికలకు ముందు చెప్పిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక చిత్తూరు జిల్లా నగరి పట్టణంలో పవర్‌లూమ్ వస్త్రాలు కొనుగోలు చేసి చేనేతకు ద్రోహం చేశారని విమర్శించారు. చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు ఇస్తానని ప్రకటించినా షెడ్ కార్మికులను విస్మరించారని చెప్పారు. రాష్ట్రంలో రెండు లక్షల మందికి పైగా మగ్గాలపై నేత నేస్తుండగా 81 వేల మందికే నేతన్ననేస్తం వర్తిస్తోందని తెలిపారు. సహకార సంఘా లకు పావలా వడ్డీ రాయితీ కింద చెల్లించా ల్సిన డబ్బులూ చెల్లించలేదన్నారు. ప్రతి చేనేత కార్మికుడికి 3 సెంట్లు స్థలం ఇవ్వా లని, ఈ ఏడాది మార్చి 31 నాటికి సిసి బకాయిలు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.శివదుర్గారావు, ఎ.వీరబ్రహ్మం, నాయకులు బి.పానకాల రావు, పి.ప్రభాకర్‌రావు, సుసులోవ్ పాల్గొన్నారు.

మాచర్లకు ఇతరులెవరూ రావొద్దు : ఎస్పీ

మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్లలో 144 సెక్షన్ అమలులో ఉందని, బయట నుండి రాజకీయ పార్టీలకు చెందిన వారెవరూ రావొద్దని పల్నాడు జిల్లా ఎస్పి రవిశంకర్‌రెడ్డి చెప్పారు. పరిస్థితులు ప్రస్తుతం అదుపులోనే ఉన్నాయన్నారు. ఈ మేరకు స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ఫ్యాక్షన్ వివదాల్లో ఉన్న వారు పట్టణంలో నివాసం ఉంటున్న నేపథ్యంలో తాము తరచూ నిర్వహించే కార్డన్‌సెర్చ్ చేసినా ఆయుధాలు, ప్రమాదకర వస్తువులేమీ దొరకలేదన్నారు. శుక్రవారం టిడిపి శ్రేణులు పట్టణంలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించే సమయంలో రెండు గ్రూపులు ఘర్షణకు దిగాయని, ముందుస్తు చర్యల్లో భాగంగా బ్రహ్మారెడ్డిని తాము గుంటూరుకు తరలించామని చెప్పారు. ఘర్షణలో ఇరు పక్షాలకు చెందిన వీడియోలను పరిశీలించి నిందితులను గుర్తించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఘర్షణలో పాల్గొన్నవారంతా పరారీలో ఉన్నారన్నారు. గతంలో బుద్దా వెంకన్న, బోండా ఉమాలపై దాడిలో కఠిన చర్యలు తీసుకోకపోవటం వల్ల ఇలాంటివి జరుగుతున్నాయనే విలేకర్ల ప్రశ్నకు స్పందిస్తూ ఈసారి కఠిన చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. దాడి జరిగిన ఇంట్లో నగదు, బంగారం అపహరణపై ప్రస్తావించగా విచారణలో అన్నీ వెలుగులోకి వస్తాయన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పి బిందుమాధవ్, సిఐలు సమీమూల్లా, భక్తవత్సలరెడ్డి, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

పోలీసులు ప్రేక్షకులా? : కాంగ్రెస్

రాజకీయ పార్టీలు ప్రచారం చేసుకునే హక్కును హరిస్తూ అధికార పార్టీ శ్రేణులు వ్యవహరించడం, భౌతిక దాడులు, కార్యాలయాలపై దాడులకు పాల్పడం ఆటవిక అన్యాయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ వై.రామచంద్రారెడ్డి ఖండించారు. శనివారం ఆ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. శుక్రవారం జరిగిన ఘటనకు పోలీసులు ప్రేక్షకులుగా మిగిలారని విమర్శించారు. సమావేశంలో జివి సత్యనారాయణ, రాగిడి ప్రతాప్‌బాబు, షేక్ బాబు, బి.ఆదాము పాల్గొన్నారు.

వివాదం సృష్టించింది టిడిపియే

ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

మంత్రి అంబటితో కలిసి క్షతగాత్రులకు పరామర్శ

ప్రజాశక్తి - నరసరావుపేట



క్షతగాత్రులను పరామర్శింస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

మాచర్లలో టిడిపి నాయకులే వైసిపివారిపై రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడి వివాదం సృష్టించారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. టిడిపి శ్రేణుల దాడులను ప్రతిఘటిస్తామని చెప్పారు. శుక్రవారం నాటి ఘర్షణల్లో గాయపడి నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైసిపి కార్యకర్తలను మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేశ్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా మరో ఇద్దరు తీవ్రగాయాల పాలైనట్లు వైద్యులు చెప్పారనట్లు పేర్కొన్నారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ టిడిపి నేతలు హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని, 7 కేసుల్లో ముద్దాయిగా ఉన్న బ్రహ్మారెడ్డి మాచర్ల టిడిపి బాధ్యతలు చేపట్టాక విధ్వంసకాండలు ప్రారంభం అయ్యాయని ఆరోపించారు. వైసిపి వెంట బీసీలు నడవడం ఓర్వలేకే బీసీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. కాసు మహేశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న పల్నాడులో చిచ్చుపెట్టేందుకు టిడిపి నిత్యం ప్రయత్నిస్తోందని, 20 కేసులు లేకపోతే టిడిపి నాయకులు కాలేరంటూ చంద్రబాబు సర్టిఫికెట్ ఇవ్వడం దేనికి సంకేతమని ప్రశ్నింకారు. దాడులకు పాల్పడిన వారిపై కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కలెక్టరేట్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

కలెక్టరేట్‌లోని అధికారులకు, సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటా ్లడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామ న్నారు. గత గురువారం జవహర్‌రెడ్డి సుస్థిర అభివద్ధి లక్ష్యాలపై కలెక్టర్లతో సమీక్షించిన సందర్భంలో గుంటూరు జిల్లాలో కౌమార దశలో ఉన్న ఆడ పిల్లలలో రక్తహీనత 55 శాతం వరకు ఉందని, వాటి కారణాలను సమగ్రంగా విశ్లేషించాల్సి ఉందని తెలుపుతూ ఆప్రయత్నంలో భాగంగా కలక్టరేట్‌లోని సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు చేపట్టాలని సూచించినట్లు కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఎంతో ఆర్థిక లబ్ది చేకూర్చుతుందని, అయినా జిల్లాలో రక్తహీనత సమస్యను విశ్లేషించుకోవాల్సి ఉందన్నారు. రక్తహీనత వల్లే మాతా, శిశు మరణాలు సంభవిస్తాయని, వీటిని నివారించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అందరూ రక్తహీనత, బీపీ, షుగర్ వంటి వాటిపై అవగాహన కలిగి వుండి, ముందస్తు ఆరోగ్య భద్రత చర్యలు పాటించాలన్నారు. జెసి మాట్లాడుతూ రక్తహీనత వల్లే 95 శాతం గైనిక్ సమస్యలు వస్తున్నాయన్నారు. కౌమార దశలో ఉన్న ఆడపిల్లల్లో రక్తహీనత ఉండడం సబబు కాదన్నారు. సంతులిత ఆహారంతో పాటు శారీరక దఢత్వం కోసం వ్యాయామం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ కె.చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ కలక్టరేట్ సిబ్బందికి వత్తి పరమైన కెపాసిటీ బిల్డింగ్‌కు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సుమయాఖాన్ మాట్లాడుతూ సామాన్యంగా ఆరోగ్యవంతుల్లో హిమోగ్లోబిన్ 14 పాయింట్ల వరకు ఉండాలన్నారు. 9 పాయింట్లకు తక్కువగా ఉంటే అది రిస్క్‌తో కూడుకున్నదన్నారు. అనంతరం మెడికల్ క్యాంపులో కలెక్టర్ రక్తపోటు పరీక్ష చేయించుకున్నారు.

ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్

ప్రాజెక్టులకు భూసేకరణ వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ ప్రాజెక్టులు, రహదారులకు సంబంధించి భూసేకరణ, ఇతర అంశాలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. శనివారం కలక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలసి జాతీయ ప్రాజెక్టు పనులు, జాతీయ రహదారులకు భూ సేకరణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ ప్రాజెక్టులు, రహదారుల భూ సేకరణకు సంబంధించి పురోగతిని తెలుసుకొని వాటిని వేగవంతంగా పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల అధికారులకు సూచనలు అందజేసారు. కలెక్టర్ మాట్లాడుతూ మంగళగిరిలోని ఎయిమ్స్‌కు మంచినీటిని సరఫరా చేసే ప్రాజెక్ట్ పనులు వేగవంతం చేయాలని ప్రజారోగ్య శాఖాధికారులను ఆదేశించారు. ఎయిమ్స్ ప్రధాన ద్వారం విస్తరణకు సంబంధించిన పనులను అటవీ శాఖాధికారులను సమన్వయం చేసుకొని, వెంటనే పూర్తి చేయాలని సూచించారు. విజయవాడ-గూడూరు రైల్వేలైన్‌కు భూసేకరణ పూర్తి చేయడం జరిగిందని, వారంలోపు రైల్వే అధికారులకు భూమిని అప్పగించాలని తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మకు సూచించారు. పేరేచర్ల నుండి కొండమోడు వరకు ఏర్పాటు చేస్తున్న జాతీయ రహదారికి గుర్తించిన భూముల డిక్లరేషన్ ను డిసెంబర్ 31 నాటికి అందించాలని గుంటూరు రెవిన్యూ డివిజన్ అధికారికి సూచించారు. సమావేశంలో డిఆర్ఓ చంద్రశేఖర్‌రావు, ఆర్‌డిఓ ప్రభాకర్‌రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రూప్లా నాయక్ పాల్గొన్నారు.

భావితరాల కోసం ఇంధన పొదుపు

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం ఇంధన శాఖ ఏర్పాటు చేసిన ర్యాలీని శనివారం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జెసి రాజ కుమారితో కలసి జెండా ఊపి ప్రారంభించారు. కలక్టరేట్ నుండి నగరపాలెంలోని మూడు బొమ్మల సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ అమూల్యమైన ఇంధన సహజ వనరులను భావితరాలకు అందించటానికి, ఇంధన వనరులను పరిరక్షించుకోవటానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా పొదుపు పాటించాలన్నారు. అవసరమైనప్పుడు మాత్రమే విద్యుత్‌ను వాడాలని, విద్యుత్‌ను దుర్వినియోగం చేయకూడదని, సూర్యకాంతి మొదలు అవగానే వీధి దీపాలను ఆఫ్ చేయాలన్నారు. తక్కువ విద్యుత్‌తో నడిచే మంచి ఉపకరణాలను వాడాలన్నారు. వాటర్ హీటర్లు, ఏసీల వాడకం తగ్గించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వధా కాకుండా చూడాలన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడడం వల్ల ప్రజలకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. పొదుపుగా కరెంట్ వినియోగంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం అన్నారు. అనంతరం ఇంధన పొదుపు పై రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమంలో డీఆర్ఓ కే.చంద్రశేఖరరావు, ఆర్డిఓ ప్రభాకరరెడ్డి, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ మురళి కష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పూడికతీత పనులు వెంటనే చేపట్టాలి

మేకల వాగును పరిశీలించిన రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - పెదనందిపాడు

వాగులు, కాలువల్లో పూడికతీత పనులు వెంటనే చేపట్టాలని రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమండ్ చేశారు. శనివారం రైతు సంఘం నాయకులు ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో సాగుకు ఆధారంగా ఉన్న పెదనందిపాడు వద్ద మేకలవాగును పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతు మూడు మండలాల్లో సాగుకు ఆధారంగా ఉన్న మేకలవాగులో పూడిక తీత గత నాలుగేళ్లగా తీయలేదన్నారు.వాగు నిండా పిచ్చికంప నిండి ఉందని, దీనివల్ల చిన్న వర్షం వచ్చినా కాలువల్లో పారుదల సరిగా లేక పోలాలను ముంచెత్తుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఈ సంవత్సరం అధిక వర్షాలు, వరదల వల్ల ఖరీఫ్, రబీలలో రెండుసార్లు రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని తెలిపారు. కావున కాలవలు, వాగుల పూడికతీత పనులను నీటిపారుదల అధికారులు వెంటనే చేపట్టాలని కోరారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను అధికారుల నమోదు చేసి నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 19వ తేదీన జిల్లా కలెక్టర్‌కు రాయబారం చేస్తామన్నారు. బాధిత రైతులు పాల్గొనాలని కోరారు. సొసైటీ రైతుల సమస్యల గురించి కూడా కలెక్టర్ కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొత్త వెంకటశివరావు, చుక్కా యానాదులు, సిహెచ్ శివకష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంగిపురం వద్ద మేకల వాగును పరిశీలిస్తున్న కె అజయ్‌కుమార్, రైతు సంఘం నాయకులు

పెండింగ్ వేతనాలివ్వాలని సిఐటియు వినతి

ప్రజాశక్తి - మంగళగిరి : సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని పెదకాకాని మండలం నంబూరు గ్రామపంచాయతీ కార్యదర్శి కి శనివారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు నెలలు తరబడి జీతాలు పెడింగ్‌లో ఉన్నాయని పంచాయతీల నుండి టెండర్ ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించినప్పటికీ ఆర్డర్ కాపీలు ఇంతవరకు పంచాయతీలకు పంపించలేదని అన్నారు. దీనివలన మూడో నెల జరుగుతున్న జీతాలు ఇవ్వలేదని, వారు ఏమి తిని బతకాలని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ జీతాలు ఇవ్వాలని లేని పక్షంలో మంగళవారం నుండి ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దీవి నరసింహారావు , కొమరగిరి సుబ్బారావు, భీమవరపు పుల్లారెడ్డి, కే నాగేశ్వరావు, కోటేశ్వరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నన్నపనేని శివాజి తదితరులు

పోరాటాల ద్వారానే హక్కులు

సిఐటియు ప్రత్తిపాడు మండల మహాసభ - నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ప్రత్తిపాడు : పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలం అని సిఐటియు జిల్లా కార్యదర్శి బి లక్ష్మణరావు అన్నారు. సిఐటియు ప్రత్తిపాడు మండల మహాసభ శనివారం బస్టాండ్ సెంటర్లో సిహెచ్ రమేష్ అధ్యక్షతన జరిగింది. లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలు అన్నింటినీ ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని, రాష్ట్రంలో కార్మికుల కనీసం వేతనాలు సవరించి దాదాపు 10 సంవత్సరాలు అవుతుందని అన్నారు. సమస్యల పరిష్కారానికి సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులను కూడగట్టి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఎం భరత్ చంద్ర పాల్గొన్నారు.

14 మందితో నూతన కమిటీ

మహాసభలో 14 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జ్యోతి, ప్రధాన కార్యదర్శులుగా సిహెచ్ రమేష్, కోశాధికారిగా కె.శ్రీనివాసరావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రత్తిపాడు మండల మహాసభలో పాల్గొన్న బి లక్ష్మణరావు తదితరులు

ప్రణతి

హరిణి

లక్ష్మీ అపర్ణ

దుర్గప్రియ

హిందూ ఫార్మసీ విద్యార్థులకు యుఎస్‌ఎలో ఎంఎస్ సీట్లు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మశీ కళాశాల 'ఫార్మా.డి' కోర్సులోఉత్తీర్ణత సాధించిన నలుగురు విద్యార్థినులు యుఎస్‌ఎలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలలో ఎంఎస్ (హెల్త్ ఇన్ఫర్‌మేటిక్) కోర్సులో ప్రవేశం పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం ఒక ప్రకటనలో తెలియచేశారు. భవిష్యత్తులో ఈ కోర్స్ చదివినవారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖలలో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. వి.లక్ష్మిఅపర్ణ ఇండియానా యూనివర్సిటీలోను, కె.సుప్రియ యూనివర్సిటీ ఆఫ్ ఫిండ్లె, కె.హరిణి, పి.ప్రణతి సీక్రెట్ హార్ట్ యూనివర్సిటీలో ఎంఎస్ ప్రవేశం పొందినట్లు తెలియచేశారు. ఆయా విద్యార్థినులను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్. మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవికుమార్, ఫార్మా.డి. డైరెక్టర్ డాక్టర్ పి. సీతారామయ్య, హెచ్ఓడి మిస్టర్ జి.సదాశివరావు అభినందనలు తెలియజేశారు.



విద్యార్థిని అభినందిస్తున కళాశాల సెక్రెటరీ, తదితరులు

మద్రాస్ ఐఐటిలో ఆర్‌విఆర్ ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

సాంకేతిక విద్యారంగంలో మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ఎన్‌పిటిఈఎల్ కోర్సుల ద్వారా నాణ్యమైన విద్యను అందిపుచ్చుకోవటానికి ఎంతో దోహదపడతాయని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజీ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) మద్రాసు వారి ద్వారా ఆర్‌విఆర్‌కు చెందిన ఇద్దరు అధ్యాపకులు టీచింగ్ రోల్ కింద డొమైన్ సర్టిఫికెట్‌లను, స్టూడెంట్ రోల్ కింద విద్యార్థినికి డొమైన్ సర్టిఫికెట్, మరొక విద్యార్థినికి ఫౌండేషన్ లెవల్ సర్టిఫికెట్‌లు అందచేశారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ ఆయా విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందచేసి అభినందించారు. విద్యార్థులకు అభ్యాసం సులభతరం చేయటానికి, ఉపాధి కల్పనకు, ఉన్నత విద్యకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవటానికి ఈఎన్‌పిటి ఈఎల్ కోర్సులు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, విభాగాధిపతి డాక్టర్ ఎంవిపి చంద్రశేఖర్ తదితరులు అధ్యాపకుల్ని, విద్యార్థుల్ని అభినందించారు.

'మొల్ల రామాయణం బహుజనుల శక్తికి నిదర్శనం'

ప్రజాశక్తి-గుంటూరు

మొల్ల రామాయణం రచించి బహుజన శక్తి సామర్థ్యాలను సమాజానికి చాటి చెప్పారని ఎమ్మెల్సీ, వైసిపి జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక జాషువా విజ్ఞాన కేంద్రంలో అంబేద్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆత్మకూరు మొల్లమాంబ-తాత్వికత అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సభకు మొల్లమాంబ కళాపరిషత్ ఫౌండ్ అండ్ ఛైర్మన్ గొల్లపల్లి లలిత్ ప్రజాపతి అధ్యక్షత వహించారు. డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ఆనాటి సామాజిక వ్యవస్థలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలు ఎంత వివక్షకు లోనైనా మొల్ల రామాయణం రచించి, వాటి సామాజిక వ్యవస్థకు బహుజనుల శక్తి సామర్థ్యాలను చాటి చెప్పారని అన్నారు. మొల్లను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిబిఎఫ్ అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, టిడ్కో ఛైర్మన్ కానూరి నాగేశ్వరరావు, కవి సుభాని, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకా చంద్రశేఖర్, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పథకాలను సద్వినియోగ పరచుకోండి

- చిలకలూరిపేటలో టిడ్కో గృహాలను ప్రారంభించిన మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర వైద్య విద్య, కుటుంబ సంక్షేమ, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు.శనివారం పట్టణంలో టిడ్కో గృహాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిలకలూరి పేట పట్టణంలో మొత్తం 2,272 ఇళ్ళను (300 ఎస్ఎఫ్‌టి ప్లాట్లు 928, 365 ఎస్ఎఫ్‌టి ప్లాట్లు 448, 430 ఎస్ఎఫ్‌టి తో 896 ప్లాట్లు) మొదటి ఫేజ్‌లో ఇచ్చినట్లు చెప్పారు. మౌలిక వసతులు కల్పించామని ,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలను ప్రజలు సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు అందించే క్రమంలో తొలి దశలో 2,272 ప్లాట్లు, రెండో దశలో మిగిలిన ప్లాట్లు నెల రోజుల్లో లబ్ధిదారులకు పూర్తి చేసి ఇస్తామన్నారు. పల్నాడు జిల్లా ఏర్పడ్డ తర్వాత తొలిసారిగా చిలకలూరిపేట పట్టణంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చొరవతో టిడ్కో గృహాలు పూర్తి చేసుకొని ప్రారంభం కావడంపై అభినందనలు తెలిపారు. వీటితో పాటు 18 వేల లబ్ధిదారులకు ఇంటి స్థలాలు మంజూరు చేసి ఇళ్ళు కూడా నిర్మితమవుతున్నట్లు చెప్పారు. త్వరలో వీటిని కూడా పూర్తిస్థాయిలో జగనన్న శాశ్వత గృహాలను ప్రారంభిస్తామన్నారు. ప్రజల సొంత ఇంటి కలను సాకారం చేసుకోవడానికి ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో చిలకలూరిపేట మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ వైస్ ఛైర్మన్ లు వలేటి వెంకటేశ్వర్లు, కొలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు.అనంతరం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల వాల్ పోస్టర్లను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమిషనర్ గోవిందరావు, ఎ. పి. టిడ్కో ఎస్.ఇ చిన్న కోటేశ్వరరావు, డిప్యూటి ఇంజనీర్ మధు, ఏ.ఇ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో 'గడపగడపకు'

ప్రజాశక్తి-యడ్లపాడు

మండలంలోని తిమ్మాపురంలో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి రజిని పాల్గొన్నారు. ఐదో రోజు అయిన ముగింపు కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజలు ఆమెకు స్వాగతం పలికారు హైవే పక్కనే ఉన్న లూథరన్ చర్చి, వసంత నూలుమిల్లు సమీపంలోని ఎస్సీ కాలనీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె పర్యటించారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడున్నరేళ్ల కాలంలో ఒక్కొక్క ఇంటికి లభించిన లబ్ధి వివరాలను కుటుంబ సభ్యులకు ఆమె వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సచివాలయం సిబ్బంది, వాలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. వ్యక్తిగత, సామాజిక పరమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, ప్రాధాన్యత క్రమంలో వాటికి పరిష్కారం చూపుతానని మంత్రి హామీ ఇచ్చారు. కాల నీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులను ఎత్తుకుని వారితో సరదాగా మాటాడారు. సమీపంలో ఉన్న జగనన్న కాలనీని సందర్శించి ఇంటి నిర్మాణాలపై లబ్ధిదారులతో చర్చించారు. కార్య క్రమంలో ఎంపిపి పిడతల ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

సంతగుడిపాడులో రీ సర్వే పనుల పరిశీలన

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలోని సంతగుడిపాడులో జరుగుతున్న రీ సర్వే పనులను మండల రెవెన్యూ అధికారి జె .శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. పొలాలను సర్వే చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాల రీ సర్వేను పారదర్శకంగా జరపాలని ఆదేశించారు. రీ సర్వేలో పొలాలకు సంబంధించి నిజమైన లబ్ధిదారులు పేర్లు నమోదు చేయాలని అన్నారు. మం డలంలో రీ సర్వే త్వరలో ముగుస్తుందని అన్నారు. రీ సర్వే చేస్తున్న సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. కార్య క్రమంలో ఆర్ఐ సుబ్బారావు సర్వేయర్ గోపిరెడ్డి, సాయి చరణ్, శ్రీనివాస్, పిచ్చయ్య, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - రాజుపాలెం

మండలంలోని అంచులవారిపాలెంలో ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందిన బిళ్లురి వెంకటేశ్వర్లు(51) కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. అతని భార్య మణెమ్మకు మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు హరి సూరమ్మ చేతుల మీదుగా వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా హరి సూరమ్మ మాట్లా డుతూ కుటుంబ పెద్దను కోల్పోయిన మణెమ్మ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో హరి నాగేశ్వరరావు, వేపురి స్వామిశంకర్. పంచాయితి కార్యదర్శి ముక్తయ్య, వాలంటీర్ జనయ్య, ఎఎన్ఎం నాగమ్మ బాయి పాల్గొన్నారు.

సీనియర్ పెన్షనర్లకు సన్మానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ప్రపంచ పెన్షన్స్ డే సందర్భంగా ఎపి పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్జీవో హోం ఆవరణలో సీనియర్ పెన్షనర్స్ కు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సత్తెనపల్లి పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు బొడ్డు రామారావు అధ్యక్షత వహించారు. అనంతరం గుంటూరు జిల్లా నాయకులు నరసింహారెడ్డి, పల్నాడు జిల్లా అధ్యక్షులు సుబ్బారావు, జి.రాఘవయ్య, రమేష్ తదితర జిల్లా నాయ టకులు పెన్షనర్లు ఎదుర్కొనే సమ స్యలపై మాట్లాడారు. సబ్ ట్రెజరీ ఆఫీసర్ బిఆర్ కె.కుమార్ మాట్లాడుతు పెన్షనర్స్ సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్జీవో అధ్యక్షులు పి. మణిరావు, వ్యవస్థాపన అధ్యక్షులు యేరువ ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి రొంపిచర్ల పురుషోత్తం తమ వార్షిక నివేదికను చదివి వినిపించారు. అనంతరం కొత్త నిర్వాహక వర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బొడ్డు రామారావు, ప్రధాన కార్యదర్శిగా రొంపిచర్ల పురుషోత్తం, కోశాధికారిగా దిడుగు మల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనం తరం డెబ్బ ఐదేళ్లు పైబడిన 25 మంది పెన్షనర్లకు సన్మానం చేశారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని కె.పోతులూరయ్య నిర్వహించారు.

విజేతలుగా 'గీతమ్స్' విద్యార్థులు

ప్రజాశక్తి - వినుకొండ

ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యా లయంలో నిర్వహించిన ఎగ్జిబిషన్ కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన,డ్రాయింగ్ కాం పిటీషన్‌లో గీతమ్స్ గ్లోబల్ మైండ్స్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వ్యాసరచన పోటీలలో 10వ తరగతికి చెందిన డి.వైష్ణవి ప్రథమ బహుమతి సాధించగా, డ్రాయింగ్ కాంపిటీషన్లో 6వ తరగతికి చెందిన జి. చాందిని ప్రథమ బహుమతి, పదవ తరగతికి చెందిన డి. వైష్ణవి ద్వితీయ బహుమతి సాధించి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పాఠశాల డైరెక్టం,హెడ్మాస్టర్ ఎన్.సూర్యనారాయణ, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

మున్సిపల్ పాఠశాలలో 'నో బ్యాగ్ డే'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం సృజనలో భాగంగా మొదటి సెషన్‌లో విద్యార్థులతో బొమ్మలు గీయిం చడం, రంగులు వేయించడం జరిగిందని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు అన్నారు. రెండవ సెషన్ లో తోటకు పోదాం, పరిశుభ్రత పాటించడం, తరగతి గదుల పాఠ శాల ఆవాస ప్రాంతం పరిశుభ్రం చేయడం జరిగిందన్నారు. మూడో సెషన్‌లో 'చదువు కుందాం'లో పాఠశాల, గ్రంథాలయ పుస్తకాలను చదివించడం జరిగిందన్నారు. నాల్గో సెష న్‌లో ఈ నెలలో వచ్చే కండ్ల కలక బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రాథ మిక ఆరోగ్య కార్యకర్త ఎన్.రాజేశ్వరి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపా ధ్యాయులు ఎ. నీలిమ, టి.కుమారి పాల్గొన్నారు.

ఎపి విఆర్ఓల అసోసియేషన్ మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి-రొంపిచర్ల

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఎపి విఆర్ఓల అసోసియేషన్ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రొంపిచర్ల విఆర్ఓ పడాల సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. వృత్తి పరంగా విఆర్ఓలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షించారు. అనంతరం ఎపి విఆర్ఓల అసోసియేషన్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విఆర్ఓల అసోసియేషన్ మండల నూతన అధ్యక్షుడిగా కొత్తపల్లి నారాయణ, ఉపాధ్యక్షుడిగా బూసి సాంబశివరావు,గౌరవాధ్యక్షుడిగా బి.అబ్బిరెడ్డి, కార్యదర్శిగా పి.సురేష్, సంయుక్త కార్యదర్శి గా గద్దె ఆనందరావు, కోశాధికారిగా గాలం లింగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం రొంపిచర్ల విఆర్ఓ పడాల సుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించారు. నూతన మండల కమిటీ సభ్యులను అభినందించారు.

మహాశివరాత్రి ఉత్సవాలు ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. శనివారం సాయంత్రం డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ స్పందన హాల్‌లో కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో జరిగే తిరునాళ్ళ కార్యకలాపాలపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా మహాశివరాత్రి సందర్భంగా కోటప్ప కొండ తిరునాళ్ళ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించాలని అది. కారులను ఆదేశించారు.తిరునాళ్ళ నాటికి అవసరమైన పనులకు టెండర్లు పిలిచి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా శాఖల అది . కారులను ఆదేశించారు. ప్రధానంగా రహదారులు, తాగునీరు, విద్యుత్తు, వసతి ఏర్పాట్లు, బారికేడ్లు, వైద్య సేవలు, స్వామి వారి దర్శనం, పూజా కార్య క్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. భక్తులు, వి.ఐ.పి దర్శనాలు, పూజలకు గాని అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. కొండ దిగువ భాగంలో ఏర్పాటు చేసే స్టాల్స్ క్రమ పద్ధతిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని పోలీస్ శాఖను ఆదేశించారు. సమీప జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ప్రయాణ సౌకర్యాలు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. అవసరమైతే అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకొని వేడుకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రసాదాల పంపిణీ, భోజన వస తులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు.తిరునాళ్ళ లో చిరు వ్యాపారాలను నిబంధనలు ప్రకారం జరుపు కునేలా తగిన విధంగా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. విజయవంతంగా మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించాలన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అధికారులు అంతా సమన్వయం తో పనులు పూర్తి చేయాలన్నారు. పండుగ సందర్భంగా తయారు చేసే ప్రభలు, ర్యాలీలు, ఊరేగింపులు, క్రమశిక్షణ, భక్తి భావం తో ఆహ్లాద కరమైన వాతావరణంలో జరిగేలా చూడాలని కోరారు. తిరుణాళ్లకు పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, సంభందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

సిపిఐ(ఎంఎల్) నాయకులు జగ్గారావు కన్నుమూత

వామపక్ష, ప్రజా సంఘాల నాయకుల నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

సిపిఐ (ఎంఎల్) పార్టీ సీనియర్ నాయకులు, ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ జగ్గారపు సుబ్బారావు (84) శనివారం మంగళగిరి రత్నాల చెరువులోని శ్రామికనగర్‌లో కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యానికి గురైన ఆయన ఎన్ఆర్ఐలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం తుదిశ్వాస విడిచారు. మృతులు సుబ్బారావుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుబ్బారావు భౌతికకాయానికి పలువురు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి కె విక్రమ్ మాట్లాడుతు తమ పార్టీ జిల్లా కమిటీ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తుందన్నారు. సుబ్బారావు చేనేత కార్మిక సమస్యలపై రాష్ట్రంలో జరిగిన అనేక పోరాటాలలోను, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలలోను, నివేశన స్థలాల కోసం జరిగిన పోరాటాలలోను చురుగ్గా పాల్గొని పనిచేశారన్నారు. సుబ్బారావు మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ ఎంల్ నాయకులు నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, దుర్గా ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ పి బాలకృష్ణ, ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కె వెంకటేశ్వరరావు, డి రామారావు, నాయకులు ఆర్ పూర్ణ చంద్రరావు తదితరులున్నారు.

మానసిక ఉల్లాసానికి 'నో బ్యాగ్ డే'

ప్రజాశక్తి-పెదనందిపాడు

విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం కలిగించేందుకు, సృజనాత్మకతను వెలికితీసేందుకు, వారిని పాఠశాలకు ఆకర్షించడానికి 'నో బ్యాగ్ డే' (సృజన-శని వారం సందడి) కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ప్రధానోపాధ్యా యులు గేరా మోహనరావు అన్నారు. కాకుమాను మండల పరిధిలోని అప్పాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠ శాల (చర్చ్ కాంపౌండ్)లో సృజన కార్యక్రమాలను నిర్వహించి నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మహమ్మద్ షహనాజ్ బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయసేవలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-తెనాలి

మండల న్యాయసేవాధికార సంస్థ, విఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల మహిళా సాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కళాశాల్లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.రమేష్ అధ్యక్షతన జరిగిన సదస్సుల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహంతుల్లా మాట్లాడుతూ విద్యార్థులు న్యాయ సేవలపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీ సీత మాట్లాడుతూ యువత చదువుతో పాటు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరమైన మేరకు ఉపయోగించుకోవా టలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నవీన్‌రెడ్డి, ఎన్‌సిసి అధికారి అనిల్‌మేరి, పి.రాజ్యలక్ష్మి, కిరణ్మయి, టూటౌన్ ఎస్ఐ నాగేశ్వరరావు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

హీరో కృష్ణకు ఎవరూ సాటిరారు

ప్రజాశక్తి-దుగ్గిరాల

సాహసవంతమైన సినిమాలు తీయ డంలో సూపర్‌స్టార్ కృష్ణకు ఎవరు సాటి రారని అభిమానులు కొనియాడారు. స్థానిక రైలుపేటలో హీరో కృష్ణ సంస్మరణసభ శనివారం నిర్వహించారు. కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ ఫ్యాన్స్ మాట్లాడుతూ సినీ పరిశ్రమకు ఆయన లేని లోటు తీర్చలేని దన్నారు. ఈ సందర్భంగా అన్నదానం, మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

లబ్ధిదారులు పనులు మొదలుపెట్టేలా చూడాలి

జగనన్న లే అవుట్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - తాడికొండ

మండలంలోని బాలయోగి గురుకుల పాఠశాల వద్ద ఉన్న జగనన్న లేఔట్‌ను హౌసింగ్ డే సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులతో అధి కారులు మాట్లాడి పనులు మొదలు పెట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధి దారులతో కలెక్టర్ మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు త్వరగా నిర్మా ణాలు చేసేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి భాస్కర్‌నాయుడు, మండల ప్రత్యేక అధికారి సుధాకర్, పిడి హౌసింగ్ సాయినాథ్, తహశీల్దార్ ఫణీంద్రబాబు, ఎంపిడిఒ మహేష్‌బాబు, హౌసింగ్ ఏఈ ఓబుల్ రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్య

ప్రజాశక్తి - తాడికొండ

రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని గురుకుల పాఠశాలల డిప్యూటీ సెక్రటరీ హితయతుల్లా అన్నారు. తాడికొండ గురుకుల పాఠశాలలో శనివారం స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన హితయతుల్లా మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 50 గురుకుల పాఠశాలలు 10 జూనియర్ ఒక డిగ్రీ కళాశాల ఉందన్నారు 1972 నుండి గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని కొనియాడారు. ముందుగా

మాట్లాడుతున్న గురుకుల పాఠశాలల డిప్యూటీ సెక్రటరీ

పాఠశాల ఆవరణలో లైబ్రరీ వద్ద పైలాన్‌ను ఆవిష్కరించారు. వివిధ ప్రాం తాలు, దేశాలలో స్థిరపడ్డ విద్యార్థులు స్వర్ణోత్సవాల సందర్భంగా కలుసుకుని గత స్మృతులను గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో రాయపాటి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ బాలశ్రీ పాల్గొన్నారు.



ముగిసిన ఎంబిఎ అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

అంతర్జాతీయ ఆన్ లైన్ సదస్సులో పలువురు ఆర్థిక శాస్త్రవేత్తలు పాల్గొని ప్రసంగించారు. శనివారం జరిగిన ముగింపు సభలో వ్యాపారంలో టెక్నాలజీని అనుసంధానం చేయడం వలన కలిగే లాభాల గురించి వక్తలు చర్చించారు. కెల్ యు ఎంబిఎ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యావేత్తలు, పరిశోధన విద్యార్థులు పాల్గొని వరుస పేపర్‌లను సమర్పించే సాంకేతికతతో సభ ప్రారంభమైంది. ఈ సభకు ఆచార్య డా. ప్రదీప్త బెనర్జీ డీన్ స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ,సిద్ధో-ఖానా-బిర్సా యూనివర్సిటీ వెస్ట్ బెంగాల్ అధ్యక్షత వహించారు. కిన్నారీ ఠక్కర్ యూనివర్సిటీ ఆఫ్ ముంబై కో-ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. కెఎల్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రొ.వి.సి.డాక్టర్ ఎన్.వెంకటరామ్ , రిజిస్ట్రార్ డాక్టరు ఎ.జగదీష్ పాలొన్నారు.

కెఎల్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన డాక్టర్ చెన్నుపాటి జగదీష్

ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తగా డాక్టర్ జగదీష్ శనివారం కెఎల్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన అధ్యాపకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సదస్సులో పాల్గొని ప్రసంగించిన. కెఎల్ విశ్వవిద్యాలయంలో ని భౌతిక శాస్త్ర విభాగం, మెటీరియల్స్ రీసెర్చ్ సొసైటీ ఆఫ్ ఇండియాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు భౌతిక శాస్త్ర విభాగం అదిపతి డాక్టర్ కె.స్వప్న తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధి వర్మ , ప్రొ.వి.సి.డాక్టర్ ఎన్. వెంకట్రామ్ , రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. జగదీష్, శాస్త్రవేత్త డాక్టర్ జగదీష్‌తో సమావేశమయ్యారు. ఆస్ట్రేలియన్ విశ్వవిద్యాలయంతో సహకారం, విద్యార్థుల మార్పిడి అవకాశాలకు సంబంధించిన అనేక విషయాలపై చర్చించారు. అనంతరం జగదీష్‌ను ఘనంగా సత్కరించారు.

పనులు కల్పించడంలో ప్రభుత్వ విఫల్యం

ప్రజాశక్తి- తాడేపల్లి: అసంఘటిత రంగంలో ఉన్న ముఠా కార్మికులకు పనులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని టిఎన్‌టియుసి, మంగళగిరి నియోజకవర్గ నాయకులు నందం అబద్దయ్య ఆందోళన వ్యక్తం చేశా రు. తాడేపల్లి నులకపేటలోని వేం "హౌసింగ్ కార్పొరేషన్ వద్ద ముఠా వర్కర్స్ యూనియన్ జెండాను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు లేకపోవడంతో ముఠా కార్మికుల కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందని అన్నారు. ప్రభు త్వం నుంచి అందవలసిన సంక్షేమ పథకాలు, బీమా ప్రోత్స హకాలు అందడం లేదని విమర్శించారు. కార్మిక రంగాన్ని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి నియో జకవర్గ అధ్యక్షులు కెటివి ప్రసాద్‌పాల్గొన్నారు.

'బాలల స్నేహ గ్రామ నిర్మాణ దిశ గా పయనిద్దాం'

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్: స్థానిక జెడ్పీ పాఠశాలలో శనివారం 'బాలల స్నేహ గ్రామ నిర్మాణ దిశగా పయనిద్దాం' అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు అధికారులతో శిక్షణ శిబిరం నిర్వహించారు. జిల్లా మహిళా శిశు అభివృద్ధి సంస్థ బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ డైరెక్టర్ మనోరంజని అధ్యక్షత వహించారు. అధికారులు ఫ్రాన్సిస్ విజయ్ కుమార్ సిడిపిఓ సుజాత దేవి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి

ప్రజాశక్తి- దుగ్గిరాల: తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి ఆరోగ్యకరమైన పంట పండించిన ఘనత మండలంలోని పెదపాలెం సర్పంచ్ పాటి బండ్ల కృష్ణ ప్రసాద్ సాధించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఎకరాకు 40 బస్తాలు దిగుబడి సాధించారు. శనివారం ఆయన పొలంలో పంట కోత ప్రయోగం నిర్వ హించారు. మండల వ్యవసాయ అధికారి పి.శిరీష, ప్రకృతి వ్యవసాయం విభాగం ఎస్‌డి ఎ.సుధారాణి,సిబ్బంది పాల్గొన్నారు.

క్లాప్‌లో భాగంగా చెరువు శుభ్రం

ప్రజాశక్తి-తెనాలి

క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాల్లో భాగంగా శనివారం పట్టణంలోని రజక చెరువును మున్సిపల్ అధికారులు శుభ్రం చేయించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు ఆదేశాల మేరకు పార్కుల్లో ఉన్న చెరువుల శుభ్రతకు శ్రీకారం చుట్టిన అధికారులు చెరువులో చెత్తాచెదారాన్ని తొలగింప చేసి, బ్లీచింగ్ చల్లించారు. వార్డు కౌన్సిలర్ వీర్ల పాటి విజయ లక్ష్మి పర్యవేక్షణలో చేపట్టిన కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు మాట్లాడుతూ పార్కుల్లో ఆహ్లాదకరవాతావరణానికి విఘాతం కలగకుండా ఉండేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో శానిటరి సెక్రటరీలు టి.శ్రీనివాసరావు, కె.నాగరాజు, ఎ.ఉమామహేశ్వరరావు, షేక్ షఫి, ఎ.వెంకటరావు, బి.సుదీప్, బి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకే బాలోత్సవం

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

బాలల్లో ఉన్న సజనాత్మకతను వెలికి తీసేందుకు బాలోత్సవం నిర్వహించామని మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఎం టి ఎం సి పరిధిలోని కుంచనపల్లి ఎంపీయుపి పాఠశాలల్లో బాలోత్సవం బహుమతి ప్రదానోత్సభకు సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో సామాజిక చైతన్యం పెరగాలని, ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో ఎక్కువ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కెఎలయు బాలోత్సవంలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది బాలోత్సవంలో ఎక్కువమంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొనే విధంగా కృషి చేస్తామని పాఠశాల ప్రధా నోపాధ్యాయులు కె.రంగారావు అన్నారు. అనంతరం బాలోత్సవంలో పాల్గొన్న విద్యార్థినీవిద్యార్థులకు షీల్డ్‌లు, సర్టిఫికెట్లను అందజేశారు. 'జన్మ భూమి' అనే లఘు నాటికకు ప్రథమ బహుమతి రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

'రౌడీ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలి'

ప్రజాశక్తి-మంగళగిరి

మాచర్ల పట్టణ మెయిన్ బజార్లో "ఇదేం కర్మ మన రాష్ట్రానికి "కార్యక్రమం నిర్వహిస్తున్న టిడిపి శ్రేణులపై శుక్రవారం రాత్రి వైసీపీ కార్యకర్తల దాడులను ఖండిస్తున్నట్లు టిడిపి నేతలు పేర్కొన్నారు. శనివారం రాత్రి నియోజకవర్గ టిడిపి కార్యాలయం డా ఎంఎస్ఎస్ భవన్‌లో వారు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్లో ఇంటలిజెన్స్ చీఫ్ సీతారామాంజనేయులు, ఎస్పీ రవి శంకర్ రెడ్డి పర్య వేక్షణలోనే మాచర్ల విధ్వంసకాండ జరిగిందని ఆరోపించారు. దాడి చేసిన తురక కిషోర్‌ను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో వైసీపీ దుర్మార్గపు, అరాచక, రౌడీ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలన్నారు. నందం అబద్దయ్య, రాష్ట్ర టిడిపి అధికార ప్రతి నిధి తమ్మిశెట్టి జానకి దేవి, పట్టణ పార్టీ అధ్యక్షులు దామర్ల రాజు, రాష్ట్ర బీసీ సాధికార సమితి కమిటీ సభ్యులు ఊట్ల శ్రీమన్నారాయణ, మన్నంగి శివశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఫస్ట్ బిహెచ్‌హెచ్.. రన్నరప్‌గా హిందూ కాలేజీ

వర్సిటీలో ముగిసిన యువజనోత్సవాలు - బహుమతులు ప్రదానం చేసిన రోజా, సంపూర్ణేష్‌బాబు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మూడ్రోజులపాటు నిర్వహించిన యువజనోత్సవాలు శనివారం ముగిశాయి. పలు అంశాల్లో విద్యార్థులు తమ ప్రతిభను చూపగా విజేతలకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్‌కె రోజా, బర్నింగ్ స్టార్ సంపూర్ణేష్‌బాబు, విసి ప్రొఫెసర్ పి.రాజశేఖర్ తదితరులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆటపాటలు చదువులో భాగమైనప్పుడే విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. వర్సిటీలో చదువు, ఇక్కడి విద్యాప్రమాణాలతో భవిష్యత్తు నిర్మించుకో గలగడం విద్యార్థులకు చక్కని అవకాశమని చెప్పారు. మరో అతిథి, సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే పరిపూర్ణత సాధిస్తారని అన్నారు. విసి మాట్లాడుతూ విద్యార్థుల మనో వికాసానికి ప్రభుత్వం, వర్సిటీ సదా సహకరిస్తాయని అన్నారు. విలువలతో కూడిన వ్యక్తులుగా ఎదగాలని సూచించారు. రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాదమూర్తి మాట్లాడుతూ శక్తి, ప్రతిభ, నిష్కల్మషం, ఆవేశం వంటివి యువతలో మెండుగా ఉంటాయని, వాటిని సన్మార్గం కోసం ఉపయోగించాలని సూచించారు.

బ్రెయిన్ బి పోటీల్లో కెఎల్‌పి విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

అమరావతి రీజినల్ బ్రెయిన్ బి న్యూరాలజీ విభాగం-2023 గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రెయిన్‌బి పోటీలలో స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి సీనియర్ సెకండరీ విద్యార్థిని సహన ప్రథమ స్థానంలో నిలిచిందని, పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకులు, డాక్టర్ యు అరుణకుమారి తదితరులు విజేతకు ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందచేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వై.రథినీచౌదరి మాట్లాడుతు కెఎల్‌పి విద్యార్థులు జ్ఞాన తృష్ణను రేకెత్తించే విధంగా విద్యను బోధిస్తుందని తెలిపారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావు, పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ కె బసవపున్నయ్య, ఎఒ కె వెంకటరావు తదితరులు సహన ను అభినందించారు.

సహానాకు మెమెంటో అందజేస్తున్న డాక్టర్ యు అరుణ కుమారి తదితరులు

ఏలూరి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు, అరండల్ పేట నుండి బ్రాడీపేట 4వ లైనులో నిర్మించిన క్రొత్త భవనంలోకి మార్పు చేసిన 'ది ఏలూరి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు' ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే.ఎస్. జవహర్ రెడ్డి, రిటైర్డ్ ప్రధాన కార్యదర్శి రమాకాంత్ రెడ్డితో కలసి శనివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా జవహర్ రెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా ఎలాంటి రిమార్కులు లేకుండా బ్యాంకును నడపడం సంతోషకర విషయమన్నారు. ముఖ్యంగా బ్యాంకుకు ఎలాంటి నిరర్ధక ఆస్తులు లేకపోవడం (ఎన్‌పిఎ) మంచి అంశమన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా, మద్దాళి గిరిధర్, రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రమాకాంత్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ ప్రజలకు మరింతగా బ్యాంకు సేవలుఅందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, మాజీ కన్నా లక్ష్మీనారాయణ, ఏలూరి బ్యాంకు చైర్మన్ ఏలూరి గురవయ్య, ఆచార్య ఎన్‌జి రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జెసి రాజకుమారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, అడిషనల్ ఎస్‌పి సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకును ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ జవహర్‌రెడ్డి, తదితరులు

1237 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ లక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు

ఖరీఫ్ 2022-23 పంట కాలానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ధాన్యం కొనుగోలు విధానం ద్వారా ఫామ్ గేట్ వద్ద నాణ్యతా ప్రమాణాలు నిర్ధారించుకొని, రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జి.లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 1,237. 080 మెట్రిక్ టన్నులు ధాన్యమును 174 రైతుల వద్ద నుంచి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేశామన్నారు. అందుకు సంబంధించిన చెల్లింపులలో భాగంగా ప్రభుత్వం 21 రోజులలో చెల్లింపులు జరుగుతాయని చెప్పినప్పటికీ, వారం రోజులలోనే రూ.1.42 కోట్లను 116 మంది రైతుల ఖాతాలలో జమ అయ్యా యన్నారు. కావున జిల్లాలోని రైతులందరూ వారి ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకి విక్రయించు కోవాలని, రైతులెవరూ దళారులను ఆశ్రయించి నష్ట పోవద్దని తెలియ చేశారు. రైతులు ధాన్య విక్రయములలో ఎటువంటి ఇబ్బందులు ఏర్పడిన నేరుగా కంట్రోల్ రూమ్ నంబరుకు (94 91 392717) ఫిర్యాదు చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

ఎన్నికలకు ఏడాది ముందే హడావుడి

వీక్షణం

ఎన్నికలకు ఏడాది ముందు నుంచే గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ప్రధానంగా పల్నాడు జిల్లాలో ఆధిపత్య రాజకీయాలు మళ్లీ పునరావృతం అవుతున్నాయి. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూడా పల్నాడులో పెద్ద ఎత్తున ఘర్షణలు జరిగాయి. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి, వైసిపి వర్గాల మధ్య ఘర్షణలు కొనసాగాయి. ఈ సారి ఎన్నికలకు ఏడాదిన్నర ముందే ఘర్షణలు జరగడం, ఢీ అంటే ఢీ అనే పరిస్థితి రావడంతో పల్నాడులో శాంతిభద్రతల సమస్య తలెత్తుతోంది. ప్రధానంగా మాచర్ల నియోజకవర్గంలో టిడిపి, వైసిపి వర్గాల మధ్య చోటుచేసుకుంటున్న ఘర్షణలలో పోలీసుల పాత్ర తరచూ వివాదస్పదం అవుతోంది. సహజంగా అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తారన్న విమర్శలు ఉన్నా కొంత మంది అధికారులు మరో అడుగు ముందుకు వేసి ప్రతిపక్ష పార్టీలను పూర్తిస్థాయిలో కట్టడికి ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ప్రతిఘటన తీవ్రంగా ఉన్నపుడు శాంతిభద్రత్రల సమస్యలు ఎదురవుతుంటాయి.

శుక్రవారం మాచర్లలో జరిగిన సంఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. మాచర్లలో కవ్వింపు ధోరణిలో వైసిపి వారు ముందుగా టిడిపి నాయకులు నిర్వహిస్తున్న రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిరోధించాలని చూడటం, ఇదే సమయంలో టిడిపి వారు ప్రతిఘటించడం, పరస్పర దాడులు జరిగాయి. తరువాత వైసిపి వారు మరింత రెచ్చిపోయి విధ్వంసానికి పాల్పడటం కొద్ది గంటల్లో జరిగిపోయింది. మాచర్లలో టిడిపి నాయకుడు బ్రహ్మారెడ్డి చాలా కాలం తరువాత క్రియాశీలక రాజకీయాల్లోకి తిరిగి రావడంతో నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌లో ఉత్సాహం వచ్చింది. ఈ నియోజకవర్గంపై బ్రహ్మారెడ్డికి పట్టు ఉండటంతో రానున్న ఎన్నికల్లో వైసిపికి తీవ్ర పోటీ ఏర్పడనుందని తెలిసి రాజకీయ వివాదాలు పెరిగి ఘర్షణలు ఏర్పడుతున్నాయి. ఈ అంశం పోలీసులు అప్రమత్తంగా లేకపోతే శాంతిభద్రతలు మరింత దిగజారే పరిస్థితులు లేకపోలేదు. మరో వైపు టిడిపి ప్రజల్లోకి వెళ్లేందుకు ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇటీవల టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పొన్నూరు నియోజకవర్గంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. అలాగే వైసిపి నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతోంది. ఎమ్మెల్యేలకు, మంత్రులకు లక్ష్యాలు ఇచ్చి ఈ కార్యక్రమాన్ని సిఎం జగన్ పర్యవేక్షిస్తున్నారు. మూడు నెలలకు ఒకసారి సమీక్ష చేసి ఎమ్మెల్యేల లోపాలను ఎత్తిచూపుతున్నారు. ప్రజల్లోకి వెళ్లని వారికి చురకలు వేస్తున్నారు. ఈ కార్యక్రమంతో ఏడాదిన్నర ముందుగానే ఎన్నికల ప్రచారానికి పరోక్షంగా వైసిపి శ్రీకారం చుట్టింది. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని సిఎం జగన్ ఇచ్చిన సూచన మేరకు ఎమ్మెల్యేలంతా ప్రజల వద్దకు వెళ్తున్నారు. తద్వారా ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత, నిరసనలను ప్రాథమిక స్థాయిలోనే నిరోధించి వారి సమస్యలను పరిష్కారం చూపాలన్న ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం కొంత మంది మంత్రులు, ఎమ్మెల్యేలు సీరియస్‌గా తీసుకోకపోయినా మెజార్టీ ఎమ్మెల్యేలు మాత్రం ప్రజల్లోకి దూసుకువెళ్తున్నారు. **(ఎవిడి శర్మ)**